క్లుప్తంగా

క్రీడాకారులకు బూట్లు అందజేత

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది క్రీడాకారులకు వ్యాపారవేత్త బత్తిన బాలాజీ అతడి తండ్రి మాల్యాద్రి చౌదరి జ్ఞాపకార్థం అవసరమైన బూట్లను విద్యార్థులకు గురువారం అందజేశారు. దీంతో ఆయనకు హెచ్ఎం సూర్యం పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, శారద పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు శంకుస్థాపన



బోరు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని గరుడభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ నిధులతో మంచినీటి బోరును ఏర్పాటు చేసేందుకు సర్పంచ్ గూడ గిరిజ చేతులమీదుగా గురువారం పనులకు శంకుస్థాపన చేశారు. విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో పనులు చేపట్టినట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వందన, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూడ ఈశ్వరరావు, గ్రామ కమిటీ కార్యదర్శి చెల్లూరి పాపారావు, కూటమి నాయకులు ఎం.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు తీరని నష్టం



టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కుటుంబాలకు తీరని నష్టం చేశారని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం టెక్కలి నియోజకవర్గ అధ్యక్షుడు మొర్రి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేనేత కార్మిక కుటుంబాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అండగా నిలిచారని గుర్తు చేశారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఎన్నో చేనేత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయన్నారు. మగ్గం కలిగిన ప్రతీ చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ఆర్థికంగా సాయం చేశారన్నారు. ఎంతో విశిష్టత కలిగిన చేనేత కార్మికులకు మరలా ప్రోత్సహించే విధంగా కూటమి ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు.

విద్యార్థులకు రంగవల్లుల పోటీలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రోటరీ క్లబ్ అధ్వర్యంలో రంగవల్లుల పోటీలను గురువారం నిర్వహించారు. రోటరీ క్లబ్ న్యూ జనరేషన్ మంత్ సందర్భంగా గురువారం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో పోటీలను చేపట్టారు. పోటీల్లో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు లక్ష్మీ, శ్రావణి మొదటి స్థానం, కావ్య, లక్ష్మీ బిసాయి ద్వితీయ స్థానం, హెబ్రాన్ మిషనరీ పాఠశాల విద్యార్థినులు కె.వినీష, పి.శృతిలు తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరికి రోటరీ క్లబ్ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

చేనేత రంగం సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం

పలాస: చేనేత రంగం సాంస్కృతిక వారసత్వానికి చిహ్నమని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జె.వెంకటలక్ష్మి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు చేనేత వస్త్రధారణ పోటీలను నిర్వహించారు. చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన చేనేత సామాజిక వర్గాన్ని గౌరవించడం, ఈ రంగం దేశ ఆర్థిక అభివృద్ధిలో ఒక భాగమని గుర్తించడం అవసరమన్నారు. అనంతరం వస్త్రధారణ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ పి.వెంకటరమణ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటరు డా.కె.గిరిజ, సునీత తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

నందిగాం: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎస్.విద్య అన్నారు. మండలంలోని దిమ్మిడిజోల సెక్టార్ రథజన బొడ్డపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఏఎన్ఎం కమలమ్మ, సుజాత పాల్గొన్నారు.
కంచిలి: తల్లిపాలతోనే బిడ్డకు సంరక్షణ ఉంటుందని సీడీపీవో కె.వసుంధర అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మండల స్థాయి తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
టెక్కలి రూరల్: టెక్కలి ప్రాజెక్ట్ కె.కొత్తూరు సెక్టార్ పరిధిలోని చాకిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో విద్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎరువు.. రైతు గుండె బరువు..!

- కళ్లెదుటే పక్కదారి పడుతున్న ఎరువులు
- ఏమీ చేయలేని స్థితిలో అన్నదాత
- సహకార సొసైటీ ముసుగులో దోచుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు



నందిగాం మండలం బెజ్జిపల్లిలో ఇటీవల అడ్డగోలుగా ఎరువులను తరలించేస్తున్న దృశ్యం



నందిగాం మండలం కనితూరులో ఎరువుల కోసం రైతుల పాట్లు(ఫైల్)

టెక్కలి: రైతులకు సరిపడా ఎరువులను పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తున్నామని.. ఎరువుల పంపిణీ విషయంలో కొన్ని పత్రికలు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారంటూ వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల మీడియా ముఖంగా ప్రకటనలు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో ఎరువుల కోసం రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. కళ్లెదుటే గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలు అడ్డగోలుగా ఎరువులు తరలిస్తున్నారు. అయినా ఏమీ చేయలేని పరిస్థితిలో అన్నదాత పడిపోయాడు. అటువంటి ఘటనలు ఒకసారి పరిశీలిస్తే...

● టెక్కలి నియోజకవర్గంలోని నందిగాం మండలం కనితూరు గ్రామంలో రైతుసేవా కేంద్రం వద్ద ఇటీవల ఎరువుల కోసం రైతులు అధిక సంఖ్యలో బారులుతీరుతూ అవస్థలు పడ్డారు. కొంతమంది రైతులు కింద పడిపోయి ఇబ్బందులు పడ్డారు.

● కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట రైతు సేవా కేంద్రానికి వచ్చిన ఎరువులను కొంతమంది స్థానిక అధికార పార్టీ కార్యకర్తలు రైతుల కళ్ల ముంగిటే తరలించుకుపోవడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో నివ్వెరపోయారు.

● నందిగాం మండలం బెజ్జిపల్లి గ్రామంలో రైతుల కోసం తెచ్చిన ఎరువులను అధికార పార్టీ కార్యకర్తలు అడ్డగోలుగా దారి మళ్లించేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదు. ఇవి కేవలం బహిర్గతమైన కొన్ని సంఘటనలు మాత్రమే. మొత్తంగా టెక్కలి నియోజకవర్గంలోని పంచాయతీల్లో అధికార పార్టీ కార్యకర్తలంతా ఇష్టారాజ్యంగా ఎరువుల దోపిడీ చేసేశారు. సహకార సొసైటీ ముసుగులో ఎరువులను పక్కదారి పట్టించి దోపిడీ చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం కనీసం పట్టించుకోకపోవడంపై రైతులు దిగాలు చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అనేక వ్యయప్రయాసలతో మండల కేంద్రాలకు వచ్చి మరీ ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు



వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో రైతులకు అవసరమైన ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు, సొసైటీల ద్వారా వచ్చిన ఎరువులను అధికార పార్టీ కార్యకర్తలు పక్కదారి పట్టిస్తున్నారు.

– బి.దివాకర్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, టెక్కలి

మంత్రి ఫెయిల్ అయ్యారు



రైతులకు అందాల్సిన ఎరువులు అధికార పార్టీ కార్యకర్తలు దోచుకుంటున్నారు. టెక్కలి నియోజకవర్గంలో పరిస్థితి దారుణంగా ఉంది. సక్రమంగా విత్తనాలు, ఎరువులు ఇవ్వకుండా వ్యవసాయ శాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఆయన రైతులకు మేలు చేసే విషయంలో ఫెయిల్ అయ్యారు. మేము చెప్పామని కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే, రైతులు ఎరువుల కోసం ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో మంత్రికి అర్థమవుతుంది.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, టెక్కలి

వెన్నుపోటు చంద్రబాబు నైజం



రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో పోస్టర్లు ప్రదర్శిస్తున్న దృశ్యం

నందిగాం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. మండలంలోని శివరాంపురంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. హామీలపై ప్రశ్నిస్తుంటే ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. మహిళలు, నిరుద్యోగులను మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో కనీసం ఎరువులు కూడా రైతులకు అందజేయలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తమిరె రాజు, అంబోడి విష్ణు, అక్కురాడ లోకనాథం, ఇప్పిలి ప్రసాదరావు, కోనారి వాసు, కోనారి ఫల్గుణరావు, బతకల చలపతిరావు, వంజరాపు రాకేష్, కోనారి ప్రదీప్, కోనారి నర్సింహమూర్తి, సనపల వైకుంఠరావు, చిన్ని రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరరావు ఒక అవినీతి తిమింగలం

- ఆయనవన్నీ అసత్య ఆరోపణలు
- ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పాలిన శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు: అగ్ని కుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ నేత పుచ్చ ఈశ్వరరావు ఒక అవినీతి తిమింగమని, పేదల భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ దందాలు చేసిన భూబకాసురుడని ఏఎంసీ మాజీ చైర్మన్ పాలిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలో గోవిందపురంలోని అతని స్వగృహంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణిపై ఈశ్వరరావు చేసిన అసత్య ఆరోపణలను ఖండించారు. గూనాలపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సింహాచలంకు అతడి తాతల నుంచి వచ్చిన 72 సెంట్లు భూమి విషయంలో అతడికి అండగా నిలవడం జరిగిందన్నారు. ఇది గిట్టకపోవడంతో తాము ఆ భూమి రూ.కోట్లకు అమ్ముకున్నామని తప్పుడు ఆరోణలు చేస్తున్నారని ఈశ్వరరావుపై మండిపడ్డారు. న్యాయస్థానం ఆశ్రయించిన సింహాచలంకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు.

స్థాయిని మరచి విమర్శిస్తున్నారు

తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలతో టీడీపీ పెద్దల ప్రాపకం కోసం ఈశ్వరరావు పాకులాడుతున్నారని మండిపడ్డారు. తానేదో పెద్ద నాయకుడినని అనిపించుకోవాలనే ఆతృతతో స్థాయిని మరిచి వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నందిగాం మండలంలోని ప్రతాప విశ్వనాథపురంలో సర్వే నంబరు 93/1లో 0.23 సెంట్లు ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసి, రియల్ ఎస్టేట్ ప్లాట్లు వేసి రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఈశ్వరరావు తన చెల్లెలు భూమిని కాజేయాలనుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పూండి– గోవిందపురంలోని జమిందారీ కుటుంబం ఆస్తులను కాజేసి మూడు ఎకరాలకు తప్పుడు పత్రాలు సృష్టించి, అతడి పేరుమీద మార్చుకున్నాడని ఆరోపించారు. పూండి నడిబొడ్డున ఉన్న గనియాబంద చెరువు గట్టుపై బడ్డీకొట్లు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న నిరుపేద వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసిన నీతిమాలిన చరిత్ర ఈశ్వరరావుది అని విమర్శించారు. ఇకనైనా అతను తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



టెక్కలి రూరల్: అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని ముఖలింగాపురం పంచాయతీ పరిధి డమర గ్రామంలో సంకల్పం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా సైబర్ నేరాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
నందిగాం: బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ములు కాజేస్తున్న సైబర్ మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని పెద్దతామరాపల్లి యూనియన్ బ్యాంకు బ్రాంచి ఫీల్డ్ ఆఫీసర్ పి.దీప్తిరేఖ అన్నారు. మండలంలోని మొండ్రాయివలస గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా బ్యాంకులు అందజేస్తున్న వివిధ రకాల బీమా సౌకర్యాలను వివరించారు. అలాగే రకరకాలుగా చేస్తున్న సైబర్ మోసాలను తెలియజేస్తూ, అలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సలాన జోగేంద్రనాయుడు, ఎం.రాములు, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీ



శాంతియుత నిరసన ర్యాలీ చేపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో గురువారం టెక్కలిలో భారీ శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం నిరంకుశ విధానాలను విడనాడకపోతే భవిష్యత్‌లో తీవ్ర మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. దాడిని ఖండిస్తూ సీతాపురం జంక్షన్ నుంచి వైఎస్సార్ జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు పృథ్వీరాజ్, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, టెక్కలి పట్టణ అధ్యక్షుడు తమ్మన్న గారి కిరణ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మార్పు అశోక్‌చక్రవర్తి, నాయకులు చిన్ని జోగారావు యాదవ్, బి.మోహనరెడ్డి, ఎన్.భీమారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే భౌతిక దాడులు



కవిటి: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నాయకుడు వేల్పుల రాములపై దాడికి పాల్పడ్డారని ఎమ్మెల్సీ నర్తు రామారావు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం కొత్తపుట్టుగలో విలేకరులతో మాట్లాడారు. భౌతిక దాడులతో ప్రజల మనసులు గెలవలేరని దుయ్యబట్టారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారంలో ఉండి కూడా కూటమి నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంపై కాకుండా ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు.

దాడి అమానుషం



ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడి చేయడం అమానుషమని ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాల్లో ప్రజాబలంతో గెలవాలి తప్ప, దాడులు చేసి జనాలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాములపై దాడిని బీసీలపై రాజకీయ దాడిగా భావిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆర్‌బీకేలు నిర్వీర్యం..!



ప్రారంభానికి నోచుకోని కంచిలి ఆర్ఎస్‌కే

- రైతులకు సక్రమంగా అందని సేవలు
- పేరుమార్చి నీరుగార్చిన కూటమి ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న అన్నదాత

కంచిలి: ఉన్న ఊరులోనే రైతులకు కావాల్సిన అన్ని సేవలు అందాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేశారు. దీనివలన రైతులకు అన్ని పనులు ఊరులోనే జరిగేవి. వ్యయ, ప్రయాసలు కూర్చి మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్‌బీకేల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. కానీ వాటి వలన ప్రస్తుతం తమకు ఎటువంటి సేవలు అందడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

మండలం	రైతు సేవా కేంద్రాలు
ఇచ్ఛాపురం	16
కవిటి	17
కంచిలి	22
సోంపేట	24

గతమెంతో ఘనం

రైతుల కోసం వైఎస్సార్‌సీపీ హయాంలో 2020లో గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో రాయితీ ధరలకే విత్తనాలు, ఎరువుల సరఫరా చేయడంతో పాటు పంటల సాగుకు అవసరమైన సలహాలు, ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ, ధాన్యం కొనుగోలు, పశుదాణా సరఫరా తదితర సేవలను అందించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. రాయితీ విత్తనాలు ఇవ్వడం కుదించింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందించింది. అది కూడా రైతు సేవా కేంద్రాల వద్ద నామమాత్రంగా సరఫరా చేసి, ఎక్కువ శాతం ప్రైవేటు డీలర్లు నుంచి కొనుగోలు చేయాల్సి వచ్చింది. తాజాగా రైతు సేవా కేంద్రాలను కుదించి క్లస్టర్ విధానాన్ని రూపొందించారు. దీంతో రైతు సేవా కేంద్రాల్లో నిరంతరం సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్ఎస్‌కేలు కొనసాగించాలి



రైతు సేవా కేంద్రాలను గత ప్రభుత్వంలో మాదిరిగానే అన్ని రకాల సేవలతో కొనసాగించాలి. వాటి వలన రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. ప్రధానంగా విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే పొందే అవకాశం ఉండేది. పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు సిబ్బంది అందుబాటులో ఉండి అందించాలి.

– కప్పల యుగంధర్, కేసరపద, కంచిలి మండలం

సేవల్లో కోత



వ్యవసాయ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రాలను ప్రతీ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో వాటిని సక్రమంగా నిర్వహించేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో క్లస్టర్ స్థాయిలో మాత్రమే ఉద్యోగులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఇలా చేయడం వలన రైతులకు అందే సేవల్లో కోత ఏర్పడుతోంది. గతంలో మాదిరిగానే కొనసాగించాలి.

– మద్దు వెంకటరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, కంచిలి మండలం

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు అందజేస్తున్న నాయకులు

సోంపేట: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ నాయకుడు బుద్దాన శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని బేసి రామచంద్రాపురం పంచాయతీ జీడిపుట్టుగ గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వకపోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలకు క్యూ ఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేసి, బాబు చేసిన మోసాలు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెయ్యి ధర్మారావు, హైమావతి, రవణమ్మ, సానా డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలు ఎలా..?



కంచిలి గ్రామంలోకి రావడానికి జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బ్రిడ్జి కింద భాగమంతా కూరగాయలు రవాణా చేసే వాహనాలను నిలుపుతున్నారు. ఇది ప్రతినిత్యం జరుగుతుండడంతో స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలుమార్లు ఇక్కడి దుస్థితిపై స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. – కంచిలి

మహిళల రక్షణకు నారీ శక్తి యాప్

ఇచ్ఛాపురం: మహిళల రక్షణ కోసం నారీశక్తి యాప్ అందుబాటులో ఉందని పలాస–కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అన్నారు. పట్టణంలోని జ్ఞాన భారతి పాఠశాల ఆవరణలో నారీశక్తి యాప్, సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.